# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 23, జూన్ 2026




# ప్రజా సంక్షేమంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం

✧ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

జైపూర్, జూన్ 22, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సామాజిక భవన నిర్మాణం పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో 25 లక్షల రూపాయల 2025-26 సి.ఎస్.ఆర్. నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ఆఖరు గింజ వరకు కొనుగోలు చేయడం జరిగిందని, ఈ ప్రక్రియలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, లారీలు, హమాలీల సమస్యల పరిష్కారం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని, అవసరం మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తూ అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా అర్హత గల నిరుద్యోగ యువతకు మందమర్రి ప్రాంతంలో జర్మనీ భాషపై శిక్షణ అందించి విదేశాలలో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి నిరుద్యోగి టామ్ కామ్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. త్వరలో అటవీ శాఖ అనుమతులతో నూతన గని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో 5 వేల మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అనంతరం భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 66 లక్షల సమగ్ర శిక్ష నిధులతో చేపట్టిన అదనపు వసతి గదులను మండల తహసిల్దార్ సదానందం, గ్రామ సర్పంచ్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. తరగతి గదిలో చదువుకుంటూ అక్కడే పడుకోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిసి అదనపు వసతి గదుల సౌకర్యం కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు మిగతా 2లో..

# భూముల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

సారంగపూర్, జూన్ 22, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన లక్ష్మణ్‌చందా మండలంలోని పలు గ్రామాల్లో సాగుతున్న భూముల రీసర్వే, డిజిటల్ సర్వే తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా మునిపెల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన రీసర్వే విధానాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలకు పాత రెవెన్యూ మ్యాపులు లేకపోవడం వల్ల భూ వివాదాలు, సరిహద్దు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ రీసర్వే ద్వారా ఆయా గ్రామాల నూతన రెవెన్యూ మ్యాపులను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. అధునాతన కొలతల యంత్రాలు, ఆధునిక సాంకేతిక సామాగ్రిని మిగతా 2లో..



# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

నిజాలను నిగ్గు తేల్చడమే జర్నలిజం: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

మందమరి, జూన్ 22, ప్రభాతవార్త



ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమాజానికి వాస్తవాలను చేరవేయడమే నిజమైన జర్నలిజమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు రాం చెందర్, ప్రధాన కార్యదర్శి సలాముద్దీన్, కోశాధికారి సకినాల శంకర్‌తో పాటు ఇతర సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి వివేక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తోందని అన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడమే కాకుండా, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే వారధిగా మిగతా 2లో..

జాతీయ మహా ప్రజా న్యాయవేదికలో

# 6,545 కేసులకు పరిష్కారం

83 మోసపూరిత నేర బాధితులకు రూ.73.67 లక్షల నగదు తిరిగి అందజేత: సిపి

మంచిర్యాల, జూన్ 22, ప్రభాతవార్త



రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ మహా ప్రజా న్యాయవేదిక విశేష ఫలితాలను సాధించింది. జూన్ 20న నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల విభాగాల పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులతో పాటు న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న రాజీ ద్వారా పరిష్కరించగల కేసులను విస్తృతంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ శిక్షాస్మృతికి సంబంధించిన 637 కేసులు, ప్రత్యేక చట్టాలకు సంబంధించిన 46 కేసులు పరిష్కరించబడ్డాయి. అదనంగా చిన్నచిన్న జరిమానా కేసులు 3,097, మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు 2,809, విపత్తు నిర్వహణ చట్టానికి సంబంధించిన 2 కేసులు పరిష్కరించడంతో మొత్తం 6,545 కేసులు ముగింపుకు చేరుకున్నాయి. అదేవిధంగా మోసపూరిత నేరాలకు సంబంధించిన 83 కేసుల్లో బాధితులకు మొత్తం రూ.73,67,714 నగదు తిరిగి అందజేశారు. కమిషనరేట్ పరిధిలోని 76 మోసపూరిత నేర కేసుల్లో బాధితులకు రూ.27,35,072 అందించగా, రామగుండంలోని కేంద్ర నేర నిరోధక పోలీసు స్టేషన్‌లో నమోదైన 7 కేసుల్లో బాధితులకు రూ.46,32,647 తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మిగతా 2లో..

## భూముల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించి సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శాస్త్రీయంగా సర్వే చేయడం వల్ల రైతులకు సంబంధించిన భూ సమస్యలు శాశ్వతంగా తొలగిపోతాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే వివరాలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం చామన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసిల్దార్ సరిత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విఠల్ రావు, ఇతర రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిస్టులు పనిచేస్తున్నారని కొనియాడారు. జర్నలిస్టులు నిష్పాక్షికత, వాస్తవికతకు ప్రాధాన్యత ఇస్తూ జర్నలిజం విలువలను కాపాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్న మంత్రి, అక్రిడేషన్ నిబంధనల ప్రకారం అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు వారి వృత్తిపరమైన భద్రతకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మందమర్రి పట్టణ అభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషించాలని, నూతన ప్రెస్ క్లబ్ కమిటీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ బలోపేతం, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ కోసం నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్ శర్మ, మున్సిపల్ కమిషనర్ తుంగాపిండి రాజలింగు, ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం చూపుతున్న చొరవ, మీడియా ప్రతినిధుల పట్ల వ్యక్తం చేసిన గౌరవం ప్రెస్ క్లబ్ సభ్యుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రజా సమస్యల పరిష్కారంలో, సమాజ శ్రేయస్సు కోసం మీడియా మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## జాతీయ మహా ప్రజా న్యాయవేదికలో 6,545 కేసులకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ప్రజా న్యాయవేదిక ద్వారా చిన్నచిన్న చట్టపరమైన వివాదాలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో ప్రజలకు సమయం, ధనం రెండూ ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు. గత పదిహేను రోజులుగా పోలీసు అధికారులు, న్యాయస్థాన సిబ్బంది కేసులకు సంబంధించిన పక్షాలను స్వయంగా కలిసి రాజీమార్గం ద్వారా త్వరిత న్యాయం పొందవచ్చని అవగాహన కల్పించడంతో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి కేసులు పరిష్కరించగలిగామని తెలిపారు.ఈ విజయానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు న్యాయపరమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన సిబ్బందికి త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. అలాగే కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీసు శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తడి, పొడి చెత్తను ట్రాక్టర్‌లో వేయాలి

**తాండూర్, జూన్ 22, ప్రభాతవార్త :**

గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తడి పొడి చెత్తను వేరువేరుగా చేసి ట్రాక్టర్ లో మాత్రమే వేయాలని తాండూర్ మండలం గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య సూచించారు. తడి, పొడి చెత్త, వ్యర్థ పదార్థాలు, పారిశుద్ధంపై ప్రజలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ లో వేసి పరిసరాలు పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌందర్య, ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్, మందమర్రి లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని, చెన్నూర్ మండలం సోమనపల్లి లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు చేపట్టడం జరిగిందని, చెన్నూర్ లోని డిగ్రీ, జూనియర్ కళాశాలలలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో పనులు చేపట్టి విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదవాలని, ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రులకు సంతోషం అందించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థను నవీకరిస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యార్థులు చక్కగా చదివి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రిని జూలై 15వ తేదీన ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మందమర్రి ప్రాంతంలో గతంలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని పునః ప్రారంభించే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జైపూర్‌లో సిఎస్ఆర్ నిధులతో సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో దాదాపు 200 ఇండ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, 8 వేల ఇండ్లు బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగిందని తెలిపారు. భీమారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల సౌకర్యం కోసం అదనపు గదులు నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో విద్యార్థుల నమోదు ఎక్కువగా జరుగుతుందని, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సరం 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో వినియోగించడం జరిగిందని, ఈ సంవత్సరం ఇప్పటివరకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, దశలవారీగా మిగతా యూరియా రావడం జరుగుతుందని, యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని దుకాణాలను ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుందని, రైతు వేదికలలో యూరియా సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయ సాగులో అవసరమైన మెలకువలు, సూచనలను అధికారుల ద్వారా అందించడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకొని అధిక పంట దిగుబడి పొందాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ విద్య సంస్థలలో సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. 100 మంది కంటే విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలలో ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు అందజేశారు. చెన్నూర్ మండలం లింగంపల్లిలో అమ్మవారి బోనాలకు జిల్లా కలెక్టర్, జైపూర్ ఎ.సి.పి.లతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

తదనంతరం కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలో లక్ష్మీదేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుండి 1 లక్ష రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం కొరకు 15 లక్షల రూపాయలు కేటాయించి భూమి పూజ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో 2 బోర్ వెల్ ఏర్పాటుతో పాటు 2 హైమాస్ లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పారుపల్లికోటపల్లి రహదారి నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై బిఆర్ఎస్వి వినతిపత్రం

**బెల్లంపల్లి, జూన్ 22, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల కోసం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం తగిన నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. అధిక ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల కార్పొరేట్ విద్యా వ్యవస్థకు మరింత ప్రోత్సాహం లభిస్తున్నదని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బిఆర్ఎస్వి తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి జిల్లా నాయకులు దగ్గుల మధు, అరుణ్ రిషి, నార్ల వంశీ, నక్క తిరుపతి, సాజిద్, బెల్లం అరుణ్, కంపెల్లి శ్రీకాంత్, జిలకర మహేష్, చంద్రకిరణ్, లక్ష్మీకాంత్, రాజేందర్, బెల్లంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, కార్యదర్శి వడ్డేపల్లి నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టండి

### ప్రజావాణిలో వినతిపత్రం అందించిన ఎన్ హెచ్ఆర్సీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సందీప్

**చెన్నూరు, జూన్ 22, ప్రభాతవార్త**

చెన్నూరు మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా విద్యను అందిస్తున్నారో లేదో తనిఖీలు చేపట్టాలని ఎన్ హెచ్ఆర్సీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సందీప్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా చూడాలని పేర్కొన్నారు.



## గిరిజన బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఆసిఫాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**

జిల్లాలోని గిరిజన బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. సోని బాలదేవి పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా విచ్చేసిన ఆ అధికారిణి గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం క్రీడా పాఠశాలకు చేరుకున్న ఆమె క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో సాధించిన పతకాలు, ట్రోఫీలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, క్రీడల ద్వారా ఆర్థికంగా ఎదిగి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాట్స్ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, శ్రీనివాస్, అశోక్, రవితేజ, సుజాత, జిల్లా యువజన, క్రీడల అధికారి అశ్వక్ అహ్మద్, ఏటీడీఓ చిరంజీవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింబారావు, జంగు, క్రీడా శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమలతో పాటు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు రవి, వనిత తదితరులు పాల్గొన్నారు.



# జర్మన్ భాష నేర్చుకుని ప్రపంచ అవకాశాలను అందిపుచ్చుకోండి: మంత్రి వివేక్

### యువతకు విదేశీ ఉపాధి అవకాశాలపై మంత్రి దిశానిర్దేశం - విదేశీ ఉపాధికి యువతను సిద్ధం చేస్తున్న జర్మన్ శిక్షణ కేంద్రం



**మందమర్రి, జూన్ 22, ప్రభాతవార్త**

యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. సోమవారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణతో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఆసక్తితో నేర్చుకోవాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువత తమ కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. విదేశాల్లో స్థానిక చట్టాలు, నిబంధనలను గౌరవిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా జర్మన్ భాషపై పట్టు సాధించాలని తెలిపారు. జర్మనీలో వారానికి 32 నుంచి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగిలిన సమయంలో ఇతర నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందినవారు తప్పకుండా విజయాన్ని సాధిస్తారని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, శిక్షణార్థులు జర్మన్ భాషను ఏకాగ్రతతో నేర్చుకోవడంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తయ్యే నాటికి భాషపై పూర్తి పట్టు సాధించి విదేశీ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీంజిగూడ గ్రామపంచాయితీని సందర్శించిన ఎంపీడీఓ

### - జన్ మన్ ఇండ్ల నిర్మాణాల నాణ్యతపై అసంతృప్తి

**తిర్యాని, జూన్22,ప్రభాతవార్త;**



తిర్యాని మండలంలోని భీంజిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గగూడ, పంగిడి, భీంజిగూడ గ్రామాలను సోమవారం తిర్యాని ఎంపీడీఓ నగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పీఎం జన్ మన్, ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ పరిశీలించారు.కాగా పంగిడి గ్రామంలో గిరిజనులకు మంజూరైన పీఎం జన్ మన్ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంపై గ్రామస్థులు ఫిర్యాదు చేయగా ఎంపీడీఓ స్వయంగా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గోడలకు పగుళ్లు, కాంక్రీట్ మిక్సింగ్ సరిగా లేదని, డోర్‌విండో ఫ్రేములు వంకరగా ఉన్నాయని, ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని అలాగే బిల్లులు రాకముందే నాణ్యత తనిఖీ చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. పంగిడి ప్రభుత్వ పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోవ దేవీంద్రబాయి, కార్యదర్శి మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కోవ విశ్వనాథ్, గ్రామ పెద్దలు టెకం సోము, ఆత్రం పండు, చిన్నరాజు పాల్గొన్నారు.

## దేగాంలో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం

**భైంసా, జూన్ 21, ప్రభాతవార్త:**

భైంసా మండల పరిధిలోని దేగాం గ్రామంలో నూతన ప్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ సిరం సుష్మరెడ్డి ఆదివారం ప్రారంభించారు. నేటి కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రభుత్వం ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి సుభాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత మెరుగైన ఉచిత విద్యను అందించేందుకు, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఈ ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శివాజీ, పంచాయతీ కార్యదర్శి విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరం

### కేంద్ర వాణిజ్య కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**మంచిర్యాల, జూన్ 22, ప్రభాతవార్త**

కేంద్ర వాణిజ్య కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో దూలం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంకె రవి, దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, కొత్త కార్మిక నిబంధనల పేరుతో కార్మికులను ప్రైవేటు, పెద్ద సంస్థలకు కట్టుబానిసలుగా మార్చే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న జీతాలను తగ్గించే ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా, 10 నుంచి 12 గంటల పని విధానాన్ని అమలు చేయవచ్చని మార్గదర్శకాలు ఇవ్వడం కార్మిక వ్యతిరేక చర్యలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కార్మికుల పట్ల శత్రుత్వ ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, బయటి సేవల ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. మంచిర్యాల జిల్లాలో వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం లేదని తెలిపారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా యాజమాన్యాలు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో కేంద్ర వాణిజ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు, ఐక్య పోరాటాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంకె రవి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, గట్టు మహేందర్ అధ్యక్షుడిగా, దూలం శ్రీనివాస్ కార్యదర్శిగా, జి. రాజేంద్ర ప్రసాద్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి రాజేశ్వరి, రాతిపెల్లి నగేష్, సహాయ కార్యదర్శులుగా కాసిపేట రాజేశం, క్యాతం భాగ్య ఎన్నికయ్యారు. అదనంగా ఇద్దరు పదాధికారులు సహనియామకంగా, మరో పది మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు.



సంతోష్‌ను శాలువాతో సన్మానించి అభినందిస్తున్న ముధోల్ మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి

## దేశ రక్షణకు ఎంపికైన సైనికుడికి సన్మానం

### - మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుభాకాంక్షలు

**భైంసా, జూన్ 21, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మాగం లక్ష్మణ్ కుమారుడు మాగం సంతోష్ దేశ రక్షణ సేనకు (భారత సైన్యానికి) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ శాసనసభ్యులు గడ్డెన్నగారి విఠల్ రెడ్డి ఆదివారం సంతోష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుండి దేశ సేవ చేయడానికి సైన్యానికి ఎంపిక కావడం అభినందనీయమని, యువత సంతోష్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సేవ చేసే అవకాశం రావడం ఆ కుటుంబానికే కాకుండా దేగాం గ్రామానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, చందు రెడ్డి, వార్డు సభ్యులు సుదర్శన్ గౌడ్, నాగేష్, చోటు, ఆనంద్, సాయి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) మాజీ చైర్మన్ టేకుల లింగన్న, పల్సి దత్తు, స్థానిక ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

## ఎస్సీ గ్రాడ్యుయేట్లకు శిక్షణతో పాటు నెలకు రూ.3 వేల భృతి

### - జిల్లా అధికారి టి. దయానంద్

**నిర్మల్, జూన్ 22, ప్రభాతవార్త:**

షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ట్రైనింగ్ ఇన్ ది అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ బిజినెస్ పథకం కింద అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి టి. దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన వారికి మూడేళ్ల పాటు వ్యాపార నిర్వహణలో శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో నెలకు రూ.3,000 చొప్పున మూడు సంవత్సరాల పాటు స్టైపెండ్ చెల్లిస్తారు. అలాగే తొలి సంవత్సరంలో డిజిటల్ పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నిచర్, న్యాయవాది దుస్తుల కొనుగోలుకు ఒకేసారి రూ.50,000 ఆర్థిక సాయం అందిస్తారు. అభ్యర్థులు చెల్లించిన దరఖాస్తు ఫీజును కూడా తిరిగి చెల్లిస్తారని అధికారి పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా జూలై 31, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ గ్రాడ్యుయేట్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రైతు వేదికలో నేడు విత్తన మేళా

**దిలావర్పూర్, జూన్ 22, ప్రభాతవార్త:**

దిలావర్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం విత్తన మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు మేలైన వరి విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ఈ ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలను ఈ మేళాలో రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధిక సంఖ్యలో విత్తన మేళాకు హాజరై తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.





## సోఫీనగర్ గురుకులంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం

**నిర్మల్, జూన్ 22, ప్రభాతవార్త:**

విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన నాణ్యతపై రాజీపడవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించిన అదనపు కలెక్టర్, వారితో ముచ్చటించారు. రోజూ రుచికరమైన భోజనం అందుతోందా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చదువులో సందేహాలుంటే వెంటనే ఉపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డానియల్, మండల విద్యాధికారి పద్మ, ఉపాధ్యాయురాలు కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

## గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో వైకుంఠాపూర్ వాసి మృతి

**సారంగాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:**




సారంగాపూర్ మండలంలోని వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీష్ గల్ఫ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం ఈ విషయం తెలియడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బతుకుదెరువు కోసం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విదేశాలకు వెళ్లిన జగదీష్ ఇక తిరిగి రాడన్న చేదు వార్త వినడంతో భార్య, కుమారుడు, కుమార్తె కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ అకాల మరణంతో వైకుంఠాపూర్ గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న జగదీష్ మరణం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జగదీష్ భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీటితో వేడుకుంటున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందాలి

### - తకలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టీకరన

**నిర్మల్, జూన్ 22, ప్రభాతవార్త:**



అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో (ఎంపీడీవో) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గుడిసెల్లో నివసించే అర్హులైన పేదలందరికీ రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను తప్పనిసరిగా మంజూరు చేయాలని స్పష్టం చేశారు. రెండో దశలో మంజూరైన ఇండ్లు, దరఖాస్తుల పరిశీలన, అనుమతించిన ఇండ్లు, ఎంపీడీవో లాగిన్‌ల నుండి కలెక్టర్ లాగిన్‌లకు పంపిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పేదలందరికీ ఇండ్లు అందేలా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. అనుమతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, రోజువారీ నివేదికలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ (హౌసింగ్ పీడీ) శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టణానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్‌లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టే నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని, ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.



అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 05 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షితమైనదని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత, కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నిమ్మల సాగర్ ప్రమాణ స్వీకారం

### సమాజ సేవలో చెన్నూరు లయన్స్ క్లబ్ ఆదర్శం

### పూర్వ గవర్నర్ లయన్ రిక్కాల నారాయణ రెడ్డి ప్రశంస

**చెన్నూరు, జూన్ 22, ప్రభాతవార్త**




చెన్నూరు పట్టణంలోని బాలాజీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి లయనిస్టిక్ ఇయర్ 202627 సంవత్సరానికి గాను చెన్నూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన 320జి పూర్వ గవర్నర్ లయన్ రిక్కాల నారాయణ రెడ్డి నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చెన్నూరు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా నిమ్మల సాగర్, కార్యదర్శిగా కప్పా ప్రతాప్ సింగ్, కోశాధికారిగా సౌడం శ్రీనివాస్, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిక్కాల నారాయణ రెడ్డి మాట్లాడుతూ చెన్నూరు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జాడి తిరుపతి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నూరు పరిసర ప్రాంతాల్లో సుమారు మూడు వేల మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం, రక్తదాన శిబిరాల ద్వారా ఎందరికో ప్రాణదాతలుగా నిలవడం అభినందనీయమన్నారు. మరణించిన వారి పార్థివ దేహాలను బంధువులు కడసారి చూసుకోవడం కోసం క్లబ్ ఏర్పాటు చేసిన బాడీ ఫ్రీజర్ ఎంతో ఉపయోగపడుతోందని గుర్తుచేశారు. అంతిమ దహన సంస్కారాల కోసం గోదావరి నది తీరానికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల మార్గంలో, ముఖ్యంగా కిలోమీటరు మేర ఇసుకలో నడవడం ఇబ్బందిగా మారినందున ఇక్కడ ఫోర్ వీలర్ వైకుంఠ వాహనం అవసరముందని స్థానికులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై పై అధికారులతో మాట్లాడి తప్పకుండా వైకుంఠ వాహనం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గం లయన్ సభ్యుల సంఖ్యను మరింత పెంచుకుంటూ, అవసరార్థులకు అండగా ఉంటూ సమాజం మన్ననలు పొందేలా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్పర్సన్ లయన్ గుర్రం చక్రధార్, క్లబ్ ఎక్సటెన్షన్ చైర్పర్సన్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, క్లబ్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పక్షవాతానికి గురైన తండ్రిని ఇండియాకు రప్పించాలని కొడుకు వేడుకోలు

### - ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి

**సారంగాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:**

దుబాయ్‌లో పక్షవాతానికి గురై అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రిని తక్షణమే స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక కుమారుడు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితుడి కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సారంగాపూర్ మండలం తల్వేదా గ్రామానికి చెందిన గడ్చుందా సాయన్న ఏడాదిన్నర క్రితం ఉపాధి కోసం యూఏఈ వెళ్లారు. అక్కడ ఒక నిర్మాణ రంగ సంస్థలో లేబర్‌గా పనిచేస్తూ సోనాపూర్ క్యాంపులో ఉంటున్నారు. అయితే, ఇటీవల ఆయన ఆకస్మికంగా పక్షవాతం బారిన పడ్డారు. దీనికి తోడు తీవ్రమైన ఆందోళన, మానసిక ఒత్తిడికి గురై ఆయన మానసిక స్థితి కూడా స్థిమితంగా లేదని తోటి కార్మికులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆందోళన చెందిన సాయన్న భార్య కమల, కొడుకు అజయ్.. ఆయనను త్వరగా ఇండియాకు పంపించాలని అక్కడి కంపెనీ యాజమాన్యాన్ని వేడుకున్నారు. అయినప్పటికీ సదరు యాజమాన్యం, ఏజెన్సీ నిరక్యం వహించడంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఎన్నారై అడ్వైజరీ కమిటీ రాష్ట్ర సభ్యులు స్వదేశీ పరికిపండ్ల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ విషయమై స్వదేశీ పరికిపండ్ల మాట్లాడుతూ.. సాయన్నను తక్షణమే భారత్‌కు తీసుకువచ్చేందుకు ఢిల్లీలోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ కార్యాలయానికి, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖకు ఈమెయిల్ ద్వారా వివరాలను పంపామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాయన్నను సురక్షితంగా స్వగ్రామానికి రప్పించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధితుడి కొడుకు అజయ్, గ్రామస్థులు అనిల్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## విత్తన మేళను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**తాండూర్, జూన్ 22, ప్రభాతవార్త :**

ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు తాండూర్ మండలంలోని కిష్టంపేట, కొత్తపల్లి, రేచిని రైతు వేదికలలో ఉదయం 9 గంటల నుంచి విత్తనమేల నిర్వహిస్తున్నట్లు ఏవో సుష్మ తెలిపారు. ఈ మేళలో డీలర్లు, కంపెనీ వారు స్టాల్స్ ఏర్పాటు చేస్తారని, విత్తనాలు, నానో యూరియా, నానో డి ఏ పి ఆమె తెలిపారు. వానాకాలం మరీ పంట వేసి రైతులు ప్రభుత్వం సూచించిన 7 రకాల మరి విత్తనాలు మాత్రమే సాగు చేయాలని, వాటికి మాత్రమే ప్రభుత్వం క్వింటాల్ కు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## మైనర్లకు గుట్కాలు, సిగరెట్లు అమ్మితే జరిమానా

### గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం..

**తాండూర్, జూన్ 22, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ కుషనపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కిరాణా దుకాణాల్లో వ్యాపారులు మైనర్లకు సిగరెట్లు, గుట్కాలుఅమ్మితే రూ.5000 జరిమానా, దుకాణం లైసెన్స్ రద్దు, యజమానులపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొందరు కిరాణా షాపు యజమానులు మైనర్లకు గుట్కాలు, సిగరెట్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. మైనర్ల కదలికలు, అలవాట్లను వారి తల్లిదండ్రులు గమనించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్, కత్తర్ల రవికుమార్, మీసా లలిత, బూత్కూరి శిరీష, పంచాయతీ సెక్రటరీ సురేందర్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన సదస్సుకు సన్నాహాలు పూర్తి

### - పాటిమిది జగన్ మోహన్ రావుకు ఘన స్వాగతం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 22, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్స్‌లో మంగళవారం జరగనున్న బీఆర్ఎస్ పార్టీ ఎస్ఐఆర్ అవగాహన సదస్సు, సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సోమవారం విచ్చేసిన సిర్పూర్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్, మాజీ తెలంగాణ రాష్ట్ర టెక్నాలజికల్ సర్వీసెస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పాటిమిది జగన్ మోహన్ రావుకు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుమారుడు కోనేరు వంశి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన పాటిమిది జగన్ మోహన్ రావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సదస్సు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.సభకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోనేరు వంశి, పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మొహరం పండుగను ప్రశాంత వాతావరణంలో సామరస్యంతో జరుపుకోవాలి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త**



మొహరం పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మామిడి భగవాన్ రెడ్డి లతో కలిసి వివిధ మండలాల తహసిల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 26న జరగనున్న మొహరం పండుగను మత సామరస్యంతో శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. మొహరం పండుగ పురస్కరించుకొని పీరీల నిర్వహణ, ఊరేగింపు కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీరు, పారిశుద్ధం, విద్యుత్ సరఫరా, ఇతర సౌకర్యాలపై శ్రద్ధ వహించాలని, ప్రార్ధన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రార్థనా మందిరాలు, పీరీల దగ్గర పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులలో సరైన లైటింగ్ వ్యవస్థ నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని, జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గ్యాస్ విషయంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వాంకిడి మండలం వెల్గి గ్రామానికి చెందిన జుగునాక బాది రావు పేదవాడు అయిన తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అదేవిధంగా సిర్పూర్ మండల కేంద్రానికి చెందిన జువెల్ల హుస్సేన్ తనకు స్వాతంత్ర సమరయోధుడి ధ్రువపత్రం ఇప్పించాలని, కౌటాల మండలం వీర్దండి గ్రామ మాజీ సర్పంచ్ తన దరఖాస్తులో తాను పదవీకాలంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని, పరిటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన ఎర్మ సుధాకర్ తనకు చెందిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమిలో సోలార్ కనెక్షన్ మంజూరు చేయాలని, చింతల మానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన రౌతు విర్ధు తన పట్టా భూమి నుండి ఇతర వ్యక్తులు బలవంతంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని దీనిపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని, లింగాపూర్ మండలం చమనాయక్ తండాకు చెందిన తేజావత్ సంగీత తనకు ఆశ వర్కర్ పోస్టు ఇప్పించాలని, బెజ్జూరు మండలం సల్గుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేసినందున సంక్షేమ పథకంలో తనను గుర్తించి పథకాలు వర్తింపజేయాలని, ఆసిఫాబాద్ మండలం గోడవెల్లి గ్రామానికి చెందిన ఘాజిరెడ్డి కార్తీక్ తనకు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌నగర్‌లో 60 గ్రాముల గంజాయి స్వాధీనం

**కాగజ్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :**

జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యల్లో భాగంగా కాగజ్‌నగర్ మండలంలోని రామ్‌నగర్ గ్రామంలో 60 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి పర్యవేక్షణలో ఈజ్‌గాం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా రామ్‌నగర్ విలేజ్ నంబర్12 ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద 60 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిగా గుర్తించిన బ్రైట్ భక్షిత్‌ను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.గంజాయిని ఎక్కడి నుంచి తెచ్చాడు, మరెవరైనా ఈ వ్యవహారంలో ఉన్నారా అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా దెబ్బతీస్తుందని పోలీసులు హెచ్చరించారు.జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

### - పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు యాదగిరి

**పెంచికల్ పేట్, జూన్ 22, ప్రభాతవార్త :**

ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్టీయూటీఎస్ ముందుండి పోరాడుతుందని మండల అధ్యక్షులు యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూటీఎస్ సభత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ పీఆర్సీ బకాయిలు, కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవోను సవరించి ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయునులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మినిమం టైమ్ స్కెల్ అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే నిర్వహించాలని, సీపీఎస్ ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. అపరిస్కృతంగా ఉన్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు గంగా భవాని, జిల్లా మహిళా కార్యదర్శి సుజాత, మండల మహిళ కార్యదర్శి ప్రియాంక, ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఉపాధ్యాయులు లక్ష్మి, భారతి, భాగ్యశ్రీ, ఈశ్వర్ రావు, సంతోష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం: ఎమ్మెల్సీ

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 22, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ మాట్లాడుతూ 25వ వార్డులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్డు సమస్యల పరిష్కారానికి ఈ పనులు దోహదపడతాయని పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్న ఎమ్మెల్సీ దండే విఠల్, చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, కౌన్సిలర్ దుర్గం సూరజ్‌లను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వసీమున్నీసా, ఎమాజీ శారద, కచ్చకాయల జ్యోతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, మున్సిపల్ డీఈ రమాదేవి, ఏఈ నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



## పారుపల్లిలో ఘనంగా బోనాల జాతర

### - శ్రీ కాలభైరవ వాసవి అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

### నిర్వహించిన మంచాల లక్ష్మీనారాయణ, సంతోష్‌లకు ప్రశంసలు

**కోటపల్లి, జూన్ 22, ప్రభాతవార్త**

కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలో లక్ష్మీదేవర బోనాల పండుగ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ దైవిక కార్యక్రమాన్ని పురస్కరించుకుని శ్రీ కాలభైరవ వాసవి అన్న ప్రసాద సేవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉప్మా, జిలేబి వితరణ కార్యక్రమం చేపట్టారు. పారుపల్లి గ్రామంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మంచాల లక్ష్మీనారాయణ, మంచాల సంతోష్ దాతల సహకారంతో ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఉదయం నుండి ఉపవాసాలతో ఉండి అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తుల కోసం శ్రీ కాలభైరవ వాసవి అన్న ప్రసాద సేవ బృందం సభ్యులు ఎంతో ప్రేమతో ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.. పండుగ రోజున భక్తులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం తమకు, తమ మనస్సులకు ఎంతో ఆనందాన్ని, తృప్తిని కలిగించాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ గొప్ప కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన తమ మిత్రులకు, గ్రామ పెద్దలకు, అమ్మవారి దర్శనం కోసం వచ్చి వెళ్ళే వారందరికీ అమ్మవారి కృప కటాక్షాలు కురిపించాలని కోరుకున్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా

### - బ్యాంకు శాఖ మేనేజర్‌కు ఘన సన్మానం..

### మిఠాయిలు పంచిన ఉద్యోగుల సంఘం నాయకులు

**మంచిర్యాల, జూన్ 22, ప్రభాతవార్త**



సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినందుకు మంచిర్యాలలోని జాతీయ బ్యాంకు ప్రధాన శాఖ మేనేజర్ అలోక్ వర్మను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పూల గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ, 70 సంవత్సరాలలోపు ఖాతాలు కలిగిన బొగ్గు గని పెన్షన్ దారులకు ప్రమాద బీమా కింద 30 లక్షల వరకు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, ఈ బీమా సౌకర్యం కుటుంబాలకు భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### - ఒకేసారి వేతనాల చెల్లింపు, కోతపడ్డ 5070

### రూపాయల జమపై కార్మికుల డిమాండ్

**మంచిర్యాల, జూన్ 22, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలోని సివిల్ సప్లై కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వడాల రాములకు వినతిపత్రం సమర్పించారు. కార్మికులకు నెలలో రెండు సార్లు వేతనాలు చెల్లించడం వల్ల కుటుంబ నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి నెల ఒకేసారి పూర్తి వేతనాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే గత మూడు నెలలుగా ప్రతి కార్మికుడి వేతనం నుంచి కోత విధించిన 5070 రూపాయలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసుతో పాటు హమాలీ కార్మికులు బైరి రాజన్న, పానుగంటి సత్యనారాయణ, తీప్పని సత్తయ్య, హరీష్, సైదం రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## బెల్లంపల్లిలో రేపటి నుంచి విత్తన మేళా

**బెల్లంపల్లి, జూన్ 22, ప్రభాతవార్త**

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు బెల్లంపల్లి వ్యవసాయ డివిజన్ పరిధిలోని అన్ని రైతు వేదికలలో జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు విత్తన మేళా నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా కొనసాగనుందని సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ రాజ నరేందర్, ఏవో ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేళాలో విత్తన డీలర్లు, విత్తన కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేసి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. ముఖ్యంగా వానాకాలం వరి సాగుకు ప్రభుత్వం సూచించిన విత్తన రకాలైన హెచ్‌ఎంటి సోన, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, జైశ్రీరామ్, కూనరం 7715, కేఎన్ఎం 1638, డబ్ల్యూ జి ఎల్ 44 విత్తనాలు రైతు వేదికలలో లభించనున్నాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను పొందాలని అధికారులు సూచించారు. మేళాకు హాజరయ్యే రైతులు పట్టాదారు పాసుపుస్తకం మరియు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు. ఈ విత్తన మేళాను విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## వార్డు మెంబర్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గులాం జావిద్

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 22, ప్రభాతవార్త :**



వార్డు మెంబర్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గులాం జావిద్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, కార్యదర్శి జంపన్న జానీ, కొమురం భీం జిల్లా ఇంచార్జి ముండే దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని వాసవి భవన్ లో నిర్వహించిన ఉపసర్పంచ్, వార్డు మెంబర్ ల సమావేశంలో రాజంపేట గ్రామపంచాయతీ 9 వ వార్డుకు చెందిన వార్డు మెంబర్ గులాం జావిద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తనను నమ్మి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్ కు వినతిపత్రం అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

## ఎస్సీ బీసీ కళాశాల హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలి

**ఆసిఫాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ కళాశాల హాస్టల్ లకు సొంత భవనాలు నిర్మించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఎస్సీ, బీసీ కళాశాల హాస్టల్ లకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ కళాశాల హాస్టల్ లకు సొంత భవనాలు లేక అద్ద భవనంలో ఇరుకు గదులలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, సరైన సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ కళాశాల హాస్టల్ భవనాల కోసం కేటాయించడం లేదని, ప్రభుత్వ భూములలో ఎస్సీ బీసీ కళాశాల హాస్టల్ భవనాల కొరకు స్థలం కేటాయించి భవనాలు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బీసీ బాలికల కళాశాల హాస్టల్ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించారని, కొంతమేరకు భవనం పనులు మిగిలిపోయాయని మిగిలిన పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకురాలు భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన ఇంటి ప్రహరి గోడ

**తాండూర్, జూన్ 22, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కొండపల్లి గంగా ఇంటి ప్రహరీ గోడ కూలింది. సోమవారం మధ్యాహ్నం వర్షం పడడంతో ఒక్కసారిగా ప్రహరి గోడ నేలమట్టం అయింది. ప్రహరీ గోడ కూలిన సమయంలో ఇంటి కుటుంబ సభ్యులు ఎవరు గోడ సమీపంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందజేయాలని బాధితురాలు కోరారు.



వర్షానికి కూలిన ఇంటి ప్రహరీ గోడ

# హానికరమైన విషయాలకు ధైర్యంగా నో చెప్పడం నేర్చుకోవాలి

### మత్తు పదార్థాల వల్ల మానసిక సమతుల్యత దెబ్బతింటుంది - డ్రగ్స్ సమాచారం ఉంటే డయల్100కు తెలపాలి

### మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ - విశ్వశాంతి కేరళ స్కూల్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు

**నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త**



విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా నో చెప్పడం నేర్చుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలను ఆయన ఆసక్తిగా పరిశీలించి వారిని అభినందించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని డీసీపీ ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని, కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై, క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చిన్నప్పటి నుంచే జనోచ చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ మేకల సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



బీఎల్ఓలకు, అధికారులకు వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

## జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ సర్వే ప్రారంభం

### - బీఎల్ఓలకు జిల్లా కలెక్టర్ హరిత దిశానిర్దేశం

**తిర్యాని, జూన్22,ప్రభాతవార్త;**

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ సర్వేపై జిల్లా కలెక్టర్ కె హరిత సోమవారం తిర్యాని మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులకు సర్వే నిర్వహణపై పలు సూచనలు చేశారు. జూన్ 25 నుంచి ఆగస్టు 31 వరకు ఇంటింటి సర్వే చేపట్టి కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ నమోదుల తొలగింపు వంటి ప్రక్రియలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తిర్యాని మండల పరిధిలోని 29 గ్రామపంచాయతీలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు తహసీల్దార్, ఎంపీడీఓలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు నింపాలని సూచించారు. ఓటర్ల పేరు, వయస్సు, కుటుంబ సంబంధం, ఫొటో, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం తదితర వివరాలను తప్పులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. చిన్న పొరపాటు వల్ల కూడా ఓటరు తన ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సర్వే పనులను ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ప్రతిరోజూ పర్యవేక్షించాలని, ప్రతి రోజు సాయంత్రం 5 గంటలలోపు పురోగతి నివేదికను జిల్లా కంట్రోల్ రూమ్‌కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నాగేష్, డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు షీ టీమ్స్ నిరంతర రక్షణ

### వేధింపులపై భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి

### మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి

**నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త**

సమాజంలో తెల్లవారుజాము నుంచే విధుల నిర్వహణ కోసం రోడ్లపైకి వచ్చే మహిళా పారిశుద్ధ్య కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, మహిళలు ధైర్యంగా ఉండాలని, వారికి అండగా, రక్షణగా షీ టీమ్స్ ఎల్లప్పుడూ ఉంటాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి భరోసా ఇచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పర్యవేక్షణలో సోమవారం మంచిర్యాల జిల్లా సీసీసీ టౌన్‌షిప్‌లో సింగరేణి పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చట్టపరంగా కల్పించబడిన హక్కులు, వేధింపుల నుంచి ఎలా రక్షణ పొందాలో కార్మికులకు వివరించారు. ఈ సదస్సులో ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, షీ టీమ్స్ విధులు, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో తెలియజేస్తూ, డయల్ 100తో పాటు రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385లను కార్మికులకు వివరించారు. లబ్ధిదారులైన మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన చర్యలు చేపడుతోందని షీ టీమ్ సిబ్బంది పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొనే ఇబ్బందులను అడిగి తెలుసుకుంటూ, రక్షణ కల్పించడంలో తాము ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, కాంట్రాక్టర్ గోపాలరావు, సూపర్‌వైజర్ రఘుతో పాటు సింగరేణి పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.





## సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

### - మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

**నస్పూర్, జూన్ 22, ప్రభాతవార్త**

పోలీస్ స్టేషన్ పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలి, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశించారు. సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సందర్శనలో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, ఛార్జ్ షీట్లకు సంబంధించిన ప్రస్తుత కేసుల స్థితిగతులపై స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం. ప్రశాంత్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులపై అధికారులు అత్యంత వేగంగా స్పందించాలని, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు అందజేయాలని డీసీపీ ఏ. భాస్కర్ స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. పరిధిలో దొంగతనాలు జరగకుండా పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విజబుల్ పోలీసింగ్, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. ప్రధానంగా చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సొత్తును త్వరితగతిన స్వాధీనం చేసుకోవడంలో అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ దర్యాప్తు కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీసీపీ సూచించారు. ఈ వారంలో జరిగే మొహర్రం పండుగను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ చర్యలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించాలి

### - సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం

**భైంసా, జూన్ 21, ప్రభాతవార్త:**

బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు సోమవారం సబ్ కలెక్టర్‌ను కలిసి క్యాంపస్ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. క్యాంపస్‌లో ఇటీవల మొదటి సంవత్సరం విద్యార్థిని భవనం పైనుంచి కిందపడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే, క్యాంపస్ మెస్‌లలో నిరంతరం పురుగులు, బొద్దింకలతో కూడిన నాణ్యత లేని కలుషిత ఆహారాన్ని వడ్డిస్తూ 9 వేల మంది విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపస్‌లోని లోపాలను, మెస్ అవినీతిని విద్యార్థులు బయటపెడుతున్నారనే కక్షతో వారి నోళ్లు నొక్కేందుకు యాజమాన్యం తరగతి గదులు, మెస్‌లలో మొబైల్ ఫోన్ల వాడకంపై నిరంకుశ ఆంక్షలు విధించిందని మండిపడ్డారు. విద్యార్థుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా జారీ చేసిన ఈ సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం, క్యాంపస్‌లో మెరుగైన వసతుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రగతిశీల విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, జిల్లా నాయకులు ప్రతాప్ పాల్గొన్నారు.



# ప్రతి టన్ను బొగ్గుపై డిజిటల్ పర్యవేక్షణ

**- సింగరేణిలో బొగ్గు రవాణా పకడ్బందీ: అసత్య ఆరోపణలకు చెక్ - మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ**

**మందమర్రి, జూన్ 22, ప్రభాతవార్త**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో బొగ్గు రవాణా వ్యవస్థ అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా జరుగుతోందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. సోమవారం మందమర్రి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి 137 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సంస్థగా దేశ ఇంధన భద్రతకు కీలకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవల సింగరేణిలో బొగ్గు చోరీలు జరిగాయని వస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. అలాంటి ప్రచారం సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పటిష్టమైన బొగ్గు రవాణా వ్యవస్థ సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా జరుగుతోందన్నారు. బొగ్గు గనిలో ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుని వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ అమలులో ఉందని తెలిపారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా పూర్తిగా ఎస్‌ఏపి ఆధారిత డిజిటల్ వ్యవస్థలో జరుగుతుందని చెప్పారు. వాహనం గనికి చేరినప్పటి నుంచి బరువు కొలతలు, లోడింగ్, వేబిల్ జారీ వరకు ప్రతి దశ ఆన్లైన్‌లో నమోదవుతుందని వివరించారు. జిపిఎస్ - జియోఫెన్సింగ్‌తో రియల్ టైం నిఘా బొగ్గు రవాణా వాహనాలన్నింటికీ జిపిఎస్/ జిపిఆర్ఎస్ ట్రాకింగ్ అమలులో ఉందని, వాహనం ఎక్కడ ఉంది, ఏ మార్గంలో వెళ్తోంది వంటి వివరాలు రియల్ టైంలో పర్యవేక్షిస్తామని తెలిపారు. జియోఫెన్సింగ్ కారణంగా వాహనం మార్గం తప్పితే వెంటనే అధికారులకు అలర్ట్ వెళ్తుందని చెప్పారు. ఆర్ ఎఫ్ ఐడిసీసీటీవీ తో సమగ్ర భద్రత సింగరేణి గనులు, వెయిబ్రిడ్జ్లు, స్టాక్ యార్డులు, ఎంట్రీఎగ్జిట్ గేట్ల వద్ద ఆర్ ఎఫ్ ఐ డి ఆధారిత బూమ్ బ్యారియర్లు, వందలాది సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటలూ పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. కాల్ నెట్ వ్యవస్థ ద్వారా ప్రతి లారీ, ప్రతి రైల్వే వ్యాగన్ బరువు ఆన్లైన్‌లో నమోదవుతుందని, లోడింగ్అన్‌లోడింగ్ సమయంలో తేడా ఉంటే కాంట్రాక్టర్ల నుంచి నష్టపరిహారం వసూలు చేస్తామని తెలిపారు.

### చెక్‌పోస్టులు - ఫ్లయింగ్ స్క్వాడ్ల గస్తీ..

అన్ని గేట్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల భౌతిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు ఆకస్మిక తనిఖీలు చేస్తూ భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నాయని వివరించారు. రైల్వే రవాణా కూడా పూర్తిగా డిజిటల్ ఫ్యూయల్ సప్లై ఒప్పందాల ప్రకారం విద్యుత్ కేంద్రాలకు రైల్వే ద్వారా బొగ్గు సరఫరా జరుగుతుందని తెలిపారు. ఎస్‌ఏపీ ఆధారంగా లోడింగ్, ట్రాకింగ్ పూర్తిగా డిజిటల్‌గా నిర్వహిస్తున్నామని చెప్పారు.

### బొగ్గు మాయమవడం అసాధ్యం...

బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుని వరకు ఆర్‌ఎఫ్ఐడి, జిపిఎస్, సీసీటీవీ, కోల్ నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్లు, సెక్యూరిటీ వ్యవస్థలతో బహుళస్థాయి పర్యవేక్షణ కొనసాగుతున్నందున బొగ్గు చోరీలు జరగడం అసాధ్యమని జీఎం స్పష్టం చేశారు. ప్రతి టన్ను బొగ్గు డిజిటల్ పర్యవేక్షణలో ఉంది. పారదర్శకత, బాధ్యత, సాంకేతికత - ఇవే సింగరేణి నిర్వహణకు మూల సూత్రాలు అని ఆయన తెలిపారు. ఈ ప్రెస్ మీట్‌లో జీఎల్ ప్రసాద్, ఎం.డి. కాదిర్, డి. రాంబాబు, సంతోష్ కుమార్, కే. కిరణ్ కుమార్, డి. విజయ్ సందీప్, డి. ప్రదీప్ కుమార్, ఆర్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

## డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఛలో హైదరాబాద్‌కు ఉప సర్పంచ్‌ల పిలుపు

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 22, ప్రభాతవార్త :**

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉప సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఖఞఛలో హైదరాబాద్ఞఞ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కార్యదర్శి జంపన్న జానీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ పై వస్తున్న వార్తలను ప్రభుత్వం ఖండించాలని, ఉప సర్పంచులకు రూ. 5వేలు, వార్డు సభ్యులకు రూ. 3 వేలు గౌరవ వేతనం చెల్లించడంతో పాటు ప్రత్యేక గుర్తింపు కల్పించడం, విధులు, అధికారాలను స్పష్టంగా నిర్వచించడం, గ్రామపంచాయతీ పాలనలో తగిన ప్రాధాన్యత కల్పించడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ తమకు సరైన గుర్తింపు, సౌకర్యాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉప సర్పంచ్‌లు హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఖఞఛలో హైదరాబాద్ఞఞ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని మండలాలు, గ్రామాల ఉప సర్పంచ్‌లు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ కార్యక్రమంకు సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచుల సంఘం జిల్లా ఇంచార్జి దీపక్ ముండే, ఉప సర్పంచులు చిట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల సిమెంట్ కర్మాగారాన్ని పునరుద్ధరించాలి

**- జిల్లా కలెక్టర్‌కు కార్మిక సంఘం వినతిపత్రం**

**మంచిర్యాల, జూన్ 22 ప్రభాతవార్త**

ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి కల్పించి, జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రతీకగా నిలిచిన మంచిర్యాల సిమెంట్ కర్మాగారాన్ని పరిరక్షించి తిరిగి ప్రారంభించాలని హింద్ మజ్దూర్ సభ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, కర్మాగారం మూతపడటంతో కార్మికులు, వారి కుటుంబాలు, నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం కర్మాగారానికి చెందిన భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కర్మాగారం కోసం కేటాయించిన సుమారు 438 ఎకరాల పారిశ్రామిక భూమిని పరిరక్షించి, ఇతర అవసరాలకు మళ్లించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కర్మాగారాన్ని స్వాధీనం చేసుకుని తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కర్మాగారం మూతపడటంతో కార్మికులకు రావాల్సిన జీతాలు, భవిష్యనిధి, పదవీ విరమణ నిధి వంటి చట్టబద్ధ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల అభీష్టం మేరకు ముఖ్యమంత్రికి ప్రత్యేక నివేదిక పంపించి కార్మికుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి కర్మాగారం భవిష్యత్తుపై సమగ్ర చర్చ జరిపి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం, కాగజ్‌నగర్ కాగితం కర్మాగారం పునరుద్ధరణకు ప్రభుత్వం చూపిన చొరవ మాదిరిగానే మంచిర్యాల సిమెంట్ కర్మాగారాన్ని కూడా పునరుద్ధరిస్తే వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని, జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు మహ్మద్ షఫీ, జిల్లా కార్యదర్శి తగరం శ్రీనివాస్, నాయకులు మహ్మద్ ఉస్సేన్, దున్నపోతుల రమేష్, పల్లపు శ్రీనివాస్, చల్ల మోహన్, చిప్పకుర్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రజలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మహమ్మద్ భాష**

**బెల్లంపల్లి, జూన్ 22, ప్రభాతవార్త**



దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం ప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తోందని సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యుడు మహమ్మద్ భాష తీవ్రంగా విమర్శించారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీలో నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ మహాసభలకు జిల్లా కార్యదర్శి గోగర్ల శంకర్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ భాష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికుల హక్కులను కాలరాస్తూ పాలన కొనసాగిస్తోందన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ప్రైవేటీకరణ పెరిగిపోతుండగా, రైతులు అప్పుల బారిన పడుతున్నారని, కార్మికులపై శ్రమదోపిడి కొనసాగుతోందన్నారు. ఒకవైపు ధరలు పెరుగుతుండగా, మరోవైపు కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల ప్రయోజనాలు కల్పిస్తున్నారని విమర్శించారు. రైతుల భూములను లాక్కునే విధానాలు, కార్మిక చట్టాలను బలహీనపరిచే చర్యలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, విద్యా మరియు ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణ వంటి నిర్ణయాలు ప్రజావ్యతిరేక పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ఉద్యమకారులు, విద్యార్థులు, కార్మిక సంఘాలపై నిర్బంధం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమై పోరాటం చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ సంపదను కొద్దిమంది పెట్టుబడిదారులకు అప్పగిస్తూ, శ్రమజీవులను దారిద్రంలోకి నెట్టివేస్తున్న పాలనకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మండల కుమారస్వామి స్వాగత ఉపన్యాసం చేశారు. అనంతరం మంచిర్యాల జిల్లా కమిటీ నివేదికను జిల్లా కార్యదర్శి గోగర్ల శంకర్ సభలో సమర్పించగా, దానిపై చర్చించి సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహాసభల్లో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శిగా గోగర్ల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి తిరుపతి, కలువల సంపత్, గుడిసెల లక్ష్మి, కలవల ప్రకాష్, లింగంపల్లి రాజు, బుజ్జి కృష్ణ, దూడ లక్ష్మి, తాటం భీమయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకత్వానికి ఎన్నికైన వారు రాష్ట్ర, జాతీయ కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలి

**ఆసిఫాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25 నుండి జూలై 24 వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలు రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపి ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి ఫోరంలో పొందుపరిచిన వివరాలను యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు సహాయకులుగా వాలంటీర్లను నియమించడం జరుగుతుందని, ఇందులో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సమైక్య సంఘ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు, కుల పెద్దలు ఉంటారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత



# మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

**- కోటపల్లి ఎస్సై రాజశేఖర్**

**- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మోడల్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు - పాఠశాలలో ప్రహరీ యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు**

**కోటపల్లి, జూన్ 22 ప్రభాతవార్త**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో కోటపల్లి ఎస్సై రాజశేఖర్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు కూలంకషంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో కొంతమంది అక్రమ వ్యాపారులు యువతనే లక్ష్యంగా చేసుకొని మత్తు పదార్థాలను ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే వీటికి బానిసలైతే విద్యాభ్యాసం దెబ్బతినడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం తీవ్రంగా పాడవుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వల్ల జ్ఞాపక శక్తి తగ్గడం, చదువుపై శ్రద్ధ లోపించడం, కుటుంబంలో గొడవలు, ఆర్థిక సమస్యలు తలెత్తి చివరకు నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందని వివరించారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా గంజాయి విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు పోలీసులు నిరంతరం తనిఖీలు, చట్టపరమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

### పాఠశాలలో ప్రహరీ కమిటీ ఏర్పాటు..

మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఈ సందర్భంగా పాఠశాలలో ఖగ్రప్రహరీ కమిటీగ్గ (యాంటీ డ్రగ్ కమిటీ) ఏర్పాటు చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులతో పాటు ఒక పోలీసు అధికారి సభ్యుడిగా ఉండే ఈ కమిటీ.. పాఠశాల స్థాయిలో మత్తు పదార్థాల నష్టాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచుతుందని ఎస్సై తెలిపారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చదువుల బాటలో తొలి అడుగు వేసిన చిన్నారులు

**వేమనపల్లి, జూన్ 19, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం నీల్వాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన చిన్నారులు అక్షరాభ్యాస కార్యక్రమం ద్వారా చదువుల బాటలో తొలి అడుగు వేశారు. మండల విద్యాధికారి శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు మధుకర్ చిన్నారులతో పలకపై తొలి అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.



# పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారిద్దాం

**కెరమెరి, జూన్ 22, ప్రభాతవార్త:**



వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారిద్దామని సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రైనేజీ పూడిక తీత పనులు, తాత్కాలిక డ్రైనేజీ కాలువలు తీయడం, రోడ్డుపై ఉన్న గుంతలు పుడ్చడం, వర్షపు నీరు ఎక్కడ నిల్వ లేకుండా చూడడం వంటి ముందస్తు జాగ్రత్తలతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి వార్డులో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీలో వేయకుండా సహకరించాలని కోరారు. పచ్చదానాన్ని పెంపొందించడానికి హరితహారం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చర్చించారు. పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కార్యక్రమం పారదర్శకంగా ఉండేలా అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండే విధంగా పాలకవర్గం చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు ఆత్రం రాజు, గేడం మాన్కు, శుభద్ర, బాంనే శ్రీకాంత్, మీనాక్షి, అబ్దుల్ సమాద్, ఫారిద్, మంజుల మరియు జీపి సిబ్బంది ఉన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 22, ప్రభాతవార్త :**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్‌లో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి తన ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాగజ్‌నగర్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను ఎలా దెబ్బతీస్తుందో ఉదాహరణలతో వివరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఈ. శారద, ముంజం రాజేశ్వర్, డా. దేవేందర్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీలోకి ముంజం ఆనంద్ కుమార్

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 22, ప్రభాతవార్త :**

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయు) నాలుగో రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పథకం కార్మికుల హక్కుల పరిరక్షణ, భూమిలేని పేదల సంక్షేమం కోసం ముంజం ఆనంద్ కుమార్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఆయన రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నిక కావడం ద్వారా జిల్లా వ్యవసాయ కార్మికుల సమస్యలను రాష్ట్ర స్థాయిలో మరింత సమర్థంగా ప్రస్తావించే అవకాశం లభించిందన్నారు. రాష్ట్ర కమిటీలో బాధ్యతలు చేపట్టనున్న ముంజం ఆనంద్ కుమార్ వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన, సామాజిక న్యాయం, సంక్షేమ కార్యక్రమాల కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఉద్యమంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

